సాక్షి
ఖమ్మం
శనివారం । 20 । జనవరి । 2024



ఉత్సాహంగా కథా కార్యశాల

విద్యార్థుల్లో రచనలపై ఆసక్తి పెంపొందించేందుకు బాలోత్సవ్ ఆధ్వర్యాన కొత్తగూడెంలో కార్యశాల నిర్వహిస్తున్నారు. 10లో



బాల్యస్నేహం.. చోరీల బంధం

జువైనల్‌హోంలో ఏర్పడిన పరిచయంతో బయటకు వచ్చాక చోరీలు చేస్తున్న ముఠా పట్టుబడగా సీపీ వివరాలు వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

దీపాదాస్ మున్షీని కలిసిన మంత్రి



దీపాదాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పుష్పగుచ్ఛం అందజేశాక పార్టీ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై నివేదికలు సిద్ధం చేయాలని, జాతీయ పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈసమావేశంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, సీపీఓ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు జ్యోతి, సుమ, శ్రీనివాసులు, కె.సత్యనారాయణ, నవీన్, కె.శ్రీరామ్, ఆంజనేయస్వామి, వేణుమనోహర్‌రావు, గౌస్‌పాషా, జి.అనసూయ, వెంగమాంబ, సోమశేఖరశర్మ, విజయకుమారి, గణేష్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో క్రమశిక్షణే కీలకం

- పోలీసు కమిషనర్ సునీల్‌దత్



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ ఉద్యోగుల్లో క్రమశిక్షణే కీలకమని సీపీ సునీల్‌దత్ తెలిపారు. పదిహేను రోజుల పాటు జరిగే సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సీపీ శుక్రవారం ప్రారంభించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా దృఢత్వం కలిగి ఉన్నప్పుడే బాధ్యతగా విధులు నిర్వర్తించడం సాధ్యమవుతుందని తెలిపారు. మొబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఏఆర్ సిబ్బంది ఇండోర్, ఔట్‌డోర్ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ప్రతిభ చాటాలని సూచించారు. కాగా, సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి పాటుపడతామని సీపీ తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ డీసీపీలు ప్రసాదరావు, కుమారస్వామి, ఆర్‌ఐలు శ్రీశైలం, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

23 నుండి సదరం క్యాంపులు

ఖమ్మంవైద్యవిభాగం: ఈనెల 23 నుండి మార్చి 26వ తేదీ వరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా నిర్ణయించిన తేదీల ప్రకారం దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకొని క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. పాలేరు, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల వారికి ఈనెల 23న తిరిగి, మార్చి 5న పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, వైరా మున్సిపాలిటీ, వైరా, ఏన్కూరు, కొణిజర్ల, తల్లాడ మండలాలకు సంబంధించి ఈనెల 30, మార్చి 12న, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, రఘునాథపాలెం మండలాల వారికి ఫిబ్రవరి 6, మార్చి 19న, ముదిగొండ, సింగరేణి, కామేపల్లి మండలాల దివ్యాంగులకు ఫిబ్రవరి 13, మార్చి 26న, మధిర మున్సిపాలిటీ, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల వారి కోసం ఫిబ్రవరి 20న, సత్తుపల్లి మున్సిపాలిటీ, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాల దివ్యాంగుల కోసం ఫిబ్రవరి 27న ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సదరం శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే క్యాంపులకు హాజరయ్యే వారు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు, మెడికల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూపరింటెండెంట్ సూచించారు.

అడుగడుగునా దగా..

రైతుకు కన్నీరు మిగులుస్తున్న ఎర్రబంగారం

- గత నెలతో పోలిస్తే గణనీయంగా పతనమైన ధర
- జెండా పాట, మోడల్ ధరకు రూ.3 వేల మేర వ్యత్యాసం
- మిర్చి ధర తగ్గుతుండడంపై మంత్రి తుమ్మల వరుస సమీక్షలు
- అయినా వ్యాపారుల తీరుతో రైతులకు నష్టం





ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఓవైపు తెగుళ్లతో దిగుబడి తగ్గగా.. అరకొరగా వచ్చిన మిర్చిని మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు చెబుతున్న ధరతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత నెలతో పోలిస్తే మిర్చి ధర భారీగా పతనం కావడం, జెండాపాటకు.. కొనుగోలు చేసే ధరకు వ్యత్యాసం ఉండడంపై రైతులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నాణ్యత పేరిట రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు తక్కువ ధర చెల్లిస్తున్నట్లు వాపోతున్నారు. గత నెలలో క్వింటా మిర్చికి గరిష్టంగా రూ.24,500 ధర పలకగా, ఇప్పుడు రూ.20,500 మాత్రమే అందుతోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 1,14,851 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 91,510 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23,341 ఎకరాల్లో మిర్చి సాగైంది. అయితే, తామర పురుగు(నల్లి) ఆశించడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఈనెలారంభం నుంచి మిర్చి విక్రయాలు ఊపందుకోగా, ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ నుంచే కాక ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు సరుకు తీసుకొస్తున్నారు. ఇక్కడ పండించే తేజ రకం మిర్చికి చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు ఉండడంతో వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పతనమవుతున్న ధర

ఖమ్మం మార్కెట్‌లో పంట విక్రయాలు పెరిగిన కొద్దీ ధర తగ్గుతుండడం రైతుల్లో ఆందోళనకు కారణమవుతోంది. ఎగుమతులు లేని కారణంగా డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. క్వింటా ధర గత నెలలో రూ.24,500 వరకు, ఈనెలారంభంలో రూ.23వేల వరకు ఉండగా ఇప్పుడు రూ.20,500, అంతకు తక్కువే పలుకుతోంది. తెగుళ్ల కారణంగా పంట నాణ్యత లేదని, తేమ శాతం ఉందంటూ వ్యాపారులు కొర్రీలు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మిర్చి ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతుండగా, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ధరల్లో తేడా ఉండడంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను రంగంలోకి దింపారు. దీంతో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి ధరలపై ఆరా తీశారు. అలాగే, మంత్రి తుమ్మల కూడా స్వయంగా మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడాక అధికారులతో సమీక్షించారు. మిర్చి రైతులు నష్టపోకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించగా.. శుక్రవారం సైతం కలెక్టర్ గౌతమ్ మార్కెట్‌ను సందర్శించి మిర్చి నాణ్యత, ధరలను పర్యవేక్షించారు.

రూ.19 వేలకే అడిగారు..



మూడెకరాల్లో మిర్చి సాగు చేస్తే తెగుళ్లతో దిగుబడి పడిపోయింది. రూ.20 వేలకు పైగా ధర వస్తుందని తొమ్మిది బస్తాల మిర్చి తీసుకొచ్చాను. కానీ వ్యాపారులు క్వింటా రూ.19 వేలకే అడిగారు. కాంటా సమయానికి ఆ ధర సైతం వస్తుందన్న నమ్మకం లేదు.

– నూనావత్ రత్న, వెన్నారం, మహబూబాబాద్ జిల్లా

ధర వస్తుందనే ఇంత దూరం..



రెండెకరాల్లో 40 బస్తాల మిర్చి దిగుబడి వచ్చింది. పంట నాణ్యంగా ఉండడంతో ఖమ్మంలో డిమాండ్ ఉంటుందని వచ్చాను. రూ.20వేల ధర పలుకుతుందని భావిస్తే రూ.18 వేలకే వ్యాపారులు అడిగారు. అమ్మాలా, లేదా అనే అయోమయంలో పడిపోయా.

– ఇస్లావత్ బద్యా, గుమ్మడివల్లి, నల్లగొండ జిల్లా

ఈనెల 10 నుంచి మార్కెట్‌కు వచ్చిన మిర్చి, ధరలు

తేదీ	బస్తాలు	గరిష్ట ధర	మోడల్ ధర	కనిష్ట ధర
10	12,289	రూ.20,100	రూ.17,000	రూ.7,000
12	16,997	రూ.21,300	రూ.18,000	రూ.8,000
17	18,803	రూ.21,300	రూ.18,000	రూ.12,000
18	24,343	రూ.20,500	రూ.17,500	రూ.14,000
19	23,281	రూ.20,500	రూ.17,000	రూ.13,800

పాట ఒకటి.. ఇచ్చేది ఇంకొకటి

జెండా పాటకు, వ్యాపారులు చెల్లించే ధరకు వ్యత్యాసం ఉంటోంది. ఇటీవలి గరిష్ట ధరతో పోలిస్తే మోడల్ ధరతోనే ఎక్కువ సరుకు కొనుగోలు చేస్తున్నారు. రెండింటి నడుమ రూ.3 వేల నుంచి రూ.3,500 తేడా ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 12న ఖమ్మం మార్కెట్‌కు 16,997 బస్తాలు విక్రయానికి రాగా కేవలం 126 బస్తాలను గరిష్టంగా రూ.21,300 ధరతో కొనుగోలు చేశారు. దీంతో నమ్మకంగా ఇక్కడకు వచ్చే రైతులకు నిరాశ ఎదురవుతోంది.

మార్కెట్‌లో మిర్చి ధరపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్



రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

ఖమ్మం మార్కెట్ సందర్శనలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంవ్యవసాయం: మిర్చి నాణ్యత పేరిట రైతులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ హెచ్చరించారు. రైతులను మోసం చేసే వ్యాపారుల లైసెన్స్ రద్దు చేసేందుకు కూడా వెనుకాడేది లేదన్నారు. మిర్చి ధరలు పడిపోతున్న నేపథ్యాన రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం మార్కెట్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడగా జెండాపాట ధరతో పొంతన లేకుండా కొనుగోళ్లు జరుగుతున్నాయని, మిర్చి నాణ్యతగా ఉన్నా తక్కువ ధర చెల్లిస్తున్నారని చెప్పారు. దీనికి కలెక్టర్ స్పందించి ధాన్యం తరహాలో నాణ్యత ఆధారంగా ధర నిర్ణయించేలా చూడాలని, 10శాతం వరకు తేమ ఉంటే గరిష్ట ధరలో రూ.2వేల వరకు తగ్గిస్తే సమంజసంగా ఉంటుందని తెలిపారు. కాగా, ముగ్గురు వ్యవసాయాధికారులను నాణ్యత పరిశీలనకు నియమిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని, న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా కల్పించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఏఓ ఎం.విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి అలీం, ఉద్యాన శాఖ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ, ఉద్యాన శాఖ అధికారి మీనాక్షి, మార్కెట్ కార్యదర్శి బీజజార్ పాల్గొన్నారు.

తేమ, రంగు ఆధారంగా మిర్చి ధర ఖరారు

మిర్చి ధర నిర్ణయానికి పలు అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ వరంగల్ జేడీ, ఖమ్మం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఈ.మల్లేశం తెలిపారు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులతో సమావేశమయ్యారు. జెండాపాటలో గరిష్ట ధర ఖరారయ్యాక ధర పడిపోతుండడానికి కారణాలు ఆరా తీశారు. అయితే, మిర్చి తేమ, రంగు ఆధారంగా ధర నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం మార్కెట్‌లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, ఉద్యాన శాఖ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ, ఉద్యానశాఖ అధికారి మీనాక్షి, మార్కెట్ అధికారులు బి.బజార్, వజీరుద్దీన్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలు సిద్ధం చేయండి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితాలు పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా, పోలింగ్‌స్టేషన్లలో వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా అర్హులందరినీ ఓటర్లుగా చేరుస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తుండగా, పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్‌డీఓలు గణేష్, అశోక్‌చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, డీఈఓ సోమశేఖరశర్మ, మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- ఆరో తరగతిలో 80 సీట్ల కోసం 3,140 మంది విద్యార్థులు పోటీ
- ఉమ్మడి జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. కాగా, ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 3,140 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరి కోసం 19 కేంద్రాలు ఏర్పాటుచేసి, పరీక్ష పకడ్బందీగా జరిగేలా ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆధార్ తప్పనిసరి

నిర్ణీత కేంద్రాల్లో శనివారం ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. అలాగే, హాల్‌టికెట్లతో పాటు ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువపత్రం తీసుకురావాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాలివే...

ఖమ్మం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, రిక్కాబజార్, ఎన్నెస్పీ కాలనీ, రాజేంద్రనగర్, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మౌంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాలలతో పాటు మధిరలోని టీవీఎం ఉన్నత పాఠశాల, సత్తుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని చుంచుపల్లి, బాబు క్యాంపు, సింగరేణి ఉన్నత పాఠశాలలు, బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇల్లెందులోని సింగరేణి, జేబీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలే కాక ములుగు జిల్లా వెంకటాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటుచేశామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఇందులో కొన్నిచోట్ల ఒకే ఆవరణలో రెండేసి పాఠశాలలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ఇక బడిలో ఎన్నికల సందడి

- ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం
- నేడు నోటిఫికేషన్, 29న ఎన్నికలు

ఖమ్మం సహకారనగర్: దాదాపు నాలుగేళ్ల తర్వాత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు షెడ్యూల్ విడుదల కావడంతో విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. 2019లో ఎస్‌ఎంసీలను నాటి ప్రభుత్వం ఏర్పాటు చేయగా కోవిడ్ తదితర కారణాలతో ఆ తర్వాత మళ్లీ ఎన్నికలు జరగకపోగా పలుమార్లు పొడిగిస్తూ వచ్చారు. ఇప్పుడు జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, సంక్షేమ శాఖలకు సంబంధించి 1,324 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు.

షెడ్యూల్ ఇలా..

ఎస్‌ఎంసీ ఎన్నికకు పాఠశాలల్లో శనివారం నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులు జాబితాను ప్రదర్శిస్తారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ వరకు స్వీకరించి.. 24న తుది జాబితా విడుదల చేస్తారు. ఇక 29వ తేదీన ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకుంటారు. అనంతరం ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ఎస్‌ఎంసీల బాధ్యతలివే..

పాఠశాలల్లో హాజరుశాతం పెంపు, మధ్యాహ్న భోజనం అమలు, పుస్తకాలు, యూనిఫాం పంపిణీని కమిటీలు పర్యవేక్షిస్తాయి. కొత్త కమిటీలతో మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

జిల్లాలో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లతో జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరిస్తాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

– ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ఇల్లెందుకు నీరందేనా?

సీతారామ ప్రాజెక్ట్‌లో పలు మార్పులు

- రూ.3,200 కోట్లతో ప్రణాళిక సిద్ధం
- కొత్తగా 1.16 లక్షల ఆయకట్టుకు నీరు
- సీడబ్ల్యూసీ పరిశీలనలో సవరించిన డీపీఆర్



సీతారామ ప్రాజెక్ట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గతానికి భిన్నంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి చోటు దక్కింది. జిల్లా సమస్యలపై ఈ ముగ్గురు మంత్రులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందుకు స్థానం కల్పించే అంశంపై ఫోకస్ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

మారిన ప్రణాళిక..

సీతారామ ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడులో శంకుస్థాపన చేశారు. కానీ ఆ తర్వాత కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు, రిజర్వ్ ఫారెస్ట్ తదితర కారణాలతో ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఇల్లెందు నియోజకవర్గం మొత్తానికే కాకుండా కొత్తగూడెం నియోజకవర్గంలోని మెజారిటీ ప్రాంతాలకు సీతారామ నీరందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ అంశంపై అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ పలుమార్లు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇల్లెందు నియోజవకర్గం కోసం ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేశారు. పాత ప్లాన్‌ను పక్కన పెట్టి జూలూరుపాడు కాలువ నుంచి ఇల్లెందు పట్టణం సమీపంలో ఉన్న లలితాపురం చెరువు (కారేపల్లి మండలం) వరకు నీటిని తీసుకొచ్చి అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి అందేలా డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్)ను సాగునీటి శాఖ ఇంజనీరింగ్ విభాగం కేంద్ర జలవనరుల సంఘానికి సమర్పించింది. కొత్తగా రూపొందించిన ఈ డీపీఆర్‌కు ఆమోదం లభిస్తే తిరిగి ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి నీరు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత అందరి దృష్టి సీతమ్మసాగర్ బ్యారేజీ, ఇప్పటికే సమర్పించిన డీపీఆర్‌లో ఉన్న కెనాళ్లు, టన్నెళ్ల మీదనే ఉంది. కానీ ఇల్లెందుకు సంబంధించిన అంశాలపై ఎవరూ చర్చించడం లేదు.

రూ.3,200 కోట్ల అంచనాతో..

సీతారామ తొలిదశలో కీలకంగా ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు తిరిగి ప్రాధాన్యత దక్కింది. వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులోని సింగరేణి మండలంలో ఉన్న లలితాపురం చెరువుకు వస్తాయి. ఈ చెరువు సముద్ర మట్టం నుంచి 175 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేసి 216 అడుగుల ఎత్తులో ఉన్న రోళ్లపాడు రిజర్వాయ్‌కు మలిదశలో నీరు చేరుస్తారు. అక్కడి నుంచి రెండు గ్రావిటీ కెనాళ్ల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. రోళ్లపాడు రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన లిఫ్ట్ నుంచి జిల్లాలోనే అత్యంత ఎత్తులో (267 అడుగులు) ఉన్న ఇల్లెందు మండలం రొంపేడు దగ్గరకు నీటిని ఎత్తి పోస్తారు. అక్కడి నుంచి బయ్యారం చెరువు వరకు గోదావరి జలాలు తరలిస్తారు. ఈ చెరువును ఆలంబనగా చేసుకుని మహబూబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. మరోవైపు జూలూరుపాడు కెనాల్ – లలితాపురం ట్యాంక్‌లను ఆధారంగా చేసుకుని రఘునాథపాలెం, సింగరేణి, ఖమ్మం అర్బన్ మండలాల్లోని గ్రామాలకు నీరు సరఫరా చేసేలా కాల్వలు తవ్వనున్నారు. సీతారామలో ఇల్లెందుకు చోటు కల్పించేందుకు రూ.3,200 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

బొగ్గుట్టకే సింహభాగం

సీతారామ ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌లో ఆయకట్టు 6.74 లక్షల ఎకరాలుగా ఉంది. కొత్తగా ఇల్లెందు కాల్వను ప్రతిపాదించడంతో ఆయకట్టు సామర్థ్యం 7.84 లక్షల ఎకరాలకు చేరుకుంది. మొత్తం మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఆయకట్టు విస్తరించి ఉంది. ఇందులో గరిష్టంగా ఖమ్మం జిల్లాలో 48 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఆ తర్వాత స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 42 వేల ఎకరాలతో ఉంది. మూడు జిల్లాల్లో విస్తరించిన ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో 65 వేల ఎకరాలు ఉండగా 25 వేల ఎకరాల ఆయకట్టుతో వైరా రెండో స్థానంలో ఉంది. అతి తక్కువగా డోర్నకల్ నియోజకవర్గంలో 263 ఎకరాలు, కొత్తగూడెం పరిధిలో 500 ఎకరాలు ఉన్నాయి.

జిల్లా	నియోజకవర్గం	ఆయకట్టు
భద్రాద్రి కొత్తగూడెం	ఇల్లెందు	65,483
భద్రాద్రి కొత్తగూడెం	కొత్తగూడెం	500
ఖమ్మం	పాలేరు	7,299
ఖమ్మం	వైరా	25,524
ఖమ్మం	ఖమ్మం	1,336
మహబూబాబాద్	డోర్నకల్	263
మొత్తం		1.11 లక్షల ఎకరాలు

క్లుప్తంగా

సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

● హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులపై హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ సమీక్ష జరగగా భారీ నీటిపారుదల, సివిల్ సప్లయిస్ శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి రైతులకు నీరందించాలని ఉన్నతాధికారులను మంత్రులు ఆదేశించారు.

ధంసలాపురం వాసికి డాక్టరేట్


చింతకుంట్ల నర్సిరెడ్డి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ధంసలాపురానికి చెందిన సీనియర్ లెక్చరర్ చింతకుంట్ల నర్సిరెడ్డి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించింది. కాగా, నర్సిరెడ్డి తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా, కష్టపడి చదువుతూనే ఆటోమొబైల్ షాపులో పనిచేస్తూ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో పాలిటెక్నిక్ లెక్చరర్ ఇంగ్లిష్ పోస్టు ఒకటే ఉండగా, రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచి సాధించారు. ప్రస్తుతం వరంగల్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

25 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 25 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎండీ మతిన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే టోర్నీలో ఉమ్మడి జిల్లాలోని జట్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఎంట్రీలను 93466 24241 నంబర్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ట్రెంచ్ పనులను అడ్డుకున్న గిరిజనులు


వాహనాలను అడ్డగించిన గిరిజనులు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో అటవీ కార్పొరేషన్ అధికారులు కందకాలు తవ్విస్తుండగా నాయకపోడు గిరిజనులు అడ్డుకున్నారు. సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడు కాలనీకి చెందిన 70 మంది నాయకపోడు గిరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఈ భూములకు ఆనుకుని ఉన్న అటవీ కార్పొరేషన్ భూములకు మధ్య పొక్లెయిన్‌తో శుక్రవారం ట్రెంచ్ కొడుతున్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గిరిజనులు లేని సమయాన పట్టా భూముల్లో నుంచి కందకాలు తీస్తున్నారని తెలుసుకున్న వారు చేరుకుని అడ్డుకున్నారు. ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న భూముల్లో కందకాలు తవ్వితే వ్యవసాయం చేసుకునే అవకాశాన్ని కోల్పోతామని వాపోయారు. కార్యక్రమంలో బేతి దుర్గా, వరలక్ష్మి, వెంకటమ్మ, రాజని లక్ష్మి, కళావతి పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ షేక్ ఖాజా ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శుక్రవారం ఆయన ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు ఇంజన్ తిరగబడింది. దీంతో కింద పడిన ఆయనకు తృటిలో ప్రమాదం తప్పినా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖాజాను ఖమ్మం తరలించారు.

వాహనదారులపై సైకో వీరంగం


వాహనదారులపై దాడికి యత్నిస్తున్న వ్యక్తి

వైరా: రోడ్డుపై వచ్చివెళ్లే వాహనదారులపై ఓ వ్యక్తి కర్రతో దాడి చేస్తూ వీరంగం సృష్టించాడు. సదరు వ్యక్తి శుక్రవారం వైరాలోని జాతీయ ప్రధాన రహదారిపై అడ్డంగా నిలబడి కర్రతో వాహనదారులపై దాడికి యత్నించాడు. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురి కాగా, సైకోగా భావించి దూరంగా వెళ్లిపోయారు. చివరకు కొందరు ధైర్యం చేసి ఆ వ్యక్తి నుంచి కర్ర లాక్కొని దేహశుద్ధి చేశాక పోలీసులకు అప్పగించారు.

తమాషా చేస్తున్నారా ?

● ఆరు నెలల నుంచి ఇటుక కదలలేదు..
● రాష్ట్రంలో ఎక్కడా పనిచేయకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతా
● కాంట్రాక్టర్, ఏఈఈపై మండిపడిన కలెక్టర్ గౌతమ్


బౌద్ధక్షేత్రం వద్ద ఇంజనీర్, కాంట్రాక్టర్‌ను మందలిస్తున్న కలెక్టర్ గౌతమ్

నేలకొండపల్లి: అభివృద్ధి పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం, జాప్యంపై కలెక్టర్ వీపీ గౌతమ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రం వద్ద రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న వసతి గృహం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అయితే, ఆ సమయానికి కాంట్రాక్టర్ రాకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పరిశీలించాలంటే కాంట్రాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని రావాలా? అని ప్రశ్నించారు. గత ఆరు నెలల నుంచి ఇక్కడ ఇటుక పని కూడా జరగకపోవడంపై మండిపడ్డారు. ఇంత నిర్లక్ష్యంగా ఉన్న కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా చేస్తున్నావని టూరిజం ఏఈఈ మహ్మద్ నాజిశ్‌పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసలు కాంట్రాక్టర్ నీ చేతిలో ఉన్నాడా.. లేక నీవే ఆయన చేతిలో ఉన్నావా.. ఇద్దరూ కలిసి తమాషా చేస్తున్నారా'అని మండిపడ్డారు. ఇకనైనా పని తీరు మారకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అలాగే, కాంట్రాక్టర్ సామినేని వెంకటేశ్వరరావుపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్.. రాష్ట్రంలో ఎక్కడా పనులు చేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతానని హెచ్చరించారు. వారంలోగా పనుల్లో వేగం పెంచి రెండు నెలల్లోగా భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భక్తరామదాసు మందిరం వద్ద రూ.2 కోట్లతో జరుగుతున్న ఆడిటోరియం పనులను పరిశీలించిన కలెక్టర్ వచ్చే నెల 5 నాటికి పూర్తి చేయాలని తెలిపారు.

24 గంటలూ వైద్య సేవలు

నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ గౌతమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి తొమ్మిది మంది సీనియర్ వైద్యులను కేటాయించినందున 24 గంటల పాటు సేవలందిస్తూ ప్రజల్లో నమ్మకం పెంచాలని సూచించారు. ఆ తర్వాత నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు సూచనలు చేశారు. కాగా, వివిధ అంశాలపై కొమ్మూరి నరేశ్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి సుమన్‌చక్రవర్తి, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, తహసీల్దార్ అనురాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

పది ఎంపీ స్థానాలు మావే..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

ఖమ్మంమామిళ్లగూడెం: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని పది ఎంపీ స్థానాలు గెలుస్తామని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధతపై పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాంచందర్‌రావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని అడ్డుకోవాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఏది ఏమైనా ఎమ్మెల్సీతో పాటు ఎంపీ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు తామే గెలుస్తామని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ మాదిరిగానే అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ గ్యారంటీని సక్రమంగా అమలుచేయలేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగా కిరణ్, ఎర్రంరాజు బెహరాతో పాటు నాయకులు దొంగల సత్యనారాయణ, నరేందర్‌రావు, రమేశ్, మందా సరస్వతి, ఉపేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

సోదరిని బస్సు ఎక్కించి వస్తుండగా ఘటన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో బీటెక్ విద్యార్థి అద్దంకి విజయ్‌కుమార్ (25) మృతి చెందాడు. రఘునాథపాలెం ఎస్‌ఐ కొండల్‌రావు కథనం ప్రకారం.. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన విజయ్‌కుమార్ గురువారం సాయంత్రం తన సోదరిని ద్విచక్ర వాహనంపై ఖమ్మం తీసుకెళ్లి హైదరాబాద్ బస్సు ఎక్కించాడు. ఆ తర్వాత స్వగ్రామానికి వెళ్తుండగా రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో ఎదురుగా వచ్చిన ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు విజయ్ తండ్రి వెంకటాచారి ఫిర్యాదుతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సోదరిని బస్సు ఎక్కించి ఇంటికి బయలుదేరిన కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మాదే అసలైన యూనియన్..

టీఎన్జీవోస్ నాయకులు శ్రీనివాస్, జైపాల్



మాట్లాడుతున్న కొణిదన శ్రీనివాస్

ఖమ్మంసహకారనగర్: రాజకీయ అండతో కొందరు తమను భయభ్రాంతులకు గురిచేసి సంఘాన్ని చేజిక్కించుకున్నారని.. ఎప్పటికైనా తమదే అసలైన టీఎన్జీవోస్ సంఘమని నాయకులు కొణిదన శ్రీనివాస్, జైపాల్, పొట్టపింజర రామయ్య, గుంటుపల్లి శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. ఖమ్మంలోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. 2016లో నాటి జిల్లా అధ్యక్షుడు కూరపాటి రంగరాజు పదవీ కాలం ముగిశాక కార్యదర్శిగా ఉన్న రామయ్యను అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. ఆ తర్వాత మరోసారి సైతం ఆయనను ఎన్నుకోగా, అనంతర కాలంలో కొందరు రాజకీయ నాయకులతో కలిసి తమను వివిధ ప్రాంతాలకు బదిలీ చేయించిన పలువురు సంఘాన్ని ఆక్రమించారని ఆరోపించారు. అప్పుడు కేంద్ర సంఘం నాయకులు సైతం వారికే సహకరించారన్నారు. కాగా, గతం నుంచి తమ కమిటీయే ఉన్నందున.. దీనిని కొనసాగిస్తూనే త్వరలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో గంగవరపు బాలకృష్ణ, కొమరగిరి దుర్గాప్రసాద్, ఈవూరి రవిచంద్ర, పూసపాటి శ్రీను, కోనార్, ధరావత్ శ్రీను, బంకా భాస్కర్, రాధాకృష్ణ, రాజశేఖర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


నక్క మధు (ఫైల్)

వేంసూరు: ఆర్థిక ఇబ్బందులతో పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసు కున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్, వేంసూరు ఎస్‌ఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన నక్క మధు (42) అదే గ్రామానికి చెందిన రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా గురువారం రాత్రి ఆయన పురుగులమందు తాగగా, బంధువులు తిరువూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మధు మృతి చెందగా బంధువుల ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

మృతుడి కుటుంబానికి రూ.లక్ష వితరణ


రూ.లక్ష అందిస్తున్న కోటేశ్వరరావు

రఘునాథపాలెం: మండలంలోని రాములుతండాలో ఇటీవల మృతి చెందిన బానోత్ కృష్ణ కుటుంబానికి ఖమ్మం నగరానికి చెందిన వ్యాపారి కొనకంచి కోటేశ్వరరావు రూ.లక్ష వితరణగా శుక్రవారం అందించారు. కృష్ణ మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురై ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, కృష్ణ గతంలో కోటేశ్వరరావు వద్ద పనిచేసినందున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోడా లౌక్య, బానోతు చాంద్రి, బోడ రవీందర్, బానోత్ తవాడియా తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య


సూర్యప్రకాష్‌రావు (ఫైల్)

చండ్రుగొండ : పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించగా మనస్తాపం చెంది ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రావికంపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రావికంపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తలారి ముత్తయ్య, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సూర్యప్రకాష్ (15) ఖమ్మం జిల్లా పెనుబల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. స్కూల్‌కు వెళ్లడం ఇష్టంలేని సూర్యప్రకాష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన ఇరుగుపొరుగువారు బాలుడ్ని చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు అడవి గేదె బలి

● ప్రస్తుతం గర్భంతో ఉన్నట్లు పోస్టుమార్టంలో తేలిన వైనం
● ఉచ్చు అమర్చిన ఆరుగురి గుర్తింపు?


వేటగాళ్ల ఉచ్చుకు మృతిచెందిన అడవిగేదె

సత్తుపల్లిరూరల్: వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తాకిన అడవి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వన్యప్రాణులను వధించేందుకు కరెంట్ స్తంభాల నుంచి అక్రమంగా తీగలు అమర్చడంతో వీటిని తాకిన అడవిగేదె మృతి చెందినట్లు భావిస్తున్నారు. అడవిలో శుక్రవారం ఉదయం అటవీ సిబ్బంది పహారా కాస్తుండగా ఈ విషయాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ వి.మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ స్నేహలత, డీఆర్‌ఓ నసరుబీ సందర్శించి వివరాలు ఆరా తీశారు. ఘటనాస్థలిలోనే కాకర్లపల్లి పశు వైద్యాధికారి సాహిత్యతో శవపరీక్ష నిర్వహించి అడవిగేదె కళేబరాన్ని ఖననం చేశారు. ఈ మేరకు పోస్ట్‌మార్టం నివేదికలో అడవిగేదె గర్భవతిగా తేలిందని అధికారులు తెలిపారు. కాగా, అడవిగేదె మృతికి కారకులుగా ఆరుగురిని గుర్తించిన అధికారులు వారి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

బాల్యస్నేహం.. చోరీల బంధం

● కొనసాగుతున్న జువైనల్ హోం నాటి స్నేహం
● ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు
● అరెస్ట్ చేసిన సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం: చిన్నతనంలోనే వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆ ముగ్గురు చోరీలకు పాల్పడగా.. అదుపులోకి తీసుకున్న పోలీసులు జువైనల్ హోంలో చేర్చారు. అక్కడ బుద్ధి మార్చుకుని బయటకు వచ్చాక మంచిగా గడపాల్సి ఉన్నా అలా జరగలేదు. అప్పటి స్నేహాన్నే కాదు చోరీలను కూడా కొనసాగించేందుకు ముఠాగా ఏర్పడ్డారు. తెలంగాణతో పాటు ఏపీలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఆ ముఠాను ఎట్టకేలకు ఖమ్మం సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రూ.22 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఖమ్మంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం వెల్లడించారు.

మూడు జిల్లాలు.. ఒకే ముఠా

మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన భీమిలి రాజ్‌కుమార్, సత్తుపల్లి రాంనగర్‌కు చెందిన నీలాల అనిల్‌కుమార్, హైదరాబాద్‌లోని మెహదీపట్నంకు చెందిన మచ్చా ఆదర్శ్ ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరుతో పాటు తెలంగాణలోని వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఇదే క్రమంలో సత్తుపల్లి మండలం గంగారంలోని బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరం లక్ష్మణ్‌రావు బేతుపల్లిలో నివాసముంటుండగా, గత నెల 19న తాళం పగులగొట్టి రూ.4.15 లక్షల విలువైన ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు చోరీ చేశారు.

రంగంలోకి సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో జరిగిన చోరీపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో రంగంలోకి దిగిన సత్తుపల్లి, ఖమ్మం సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటి చుట్టుపక్కల ఇళ్లలోని సీసీ పుటేజీలు పరిశీలించగా నిందితులను పాతనేరస్తులుగా గుర్తించారు. దీంతో ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. అయితే, బేతుపల్లి చోరీతో పాటు మొత్తం 15 కేసుల్లో వీరు నిందితులని తేలింది.

పగలు గుర్తింపు.. రాత్రి చోరీ

రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, ఆదర్శ్ బాలనేరస్తులు కావడంతో జువైనల్‌హోంలో ఉన్నప్పుడు పరిచయం ఏర్పడింది. అయితే, పెద్దయ్యాక కూడా మార్పు రాకపోగా అనిల్ నేతృత్వాన ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముగ్గురు పగటి పూట వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి చోరీలకు పాల్పడేవారు. ఒకవేళ తాళం పగలగొట్టడం సాధ్యం కాకపోతే బయట పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. వీరి నుంచి సత్తుపల్లి రాంనగర్‌కు చెందిన తోట నరేశ్ చోరీ సొత్తు కొనుగోలు చేసినట్లు తేలడంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఏసీపీ రవికుమార్, సత్తుపల్లి, సీసీఎస్ సీఐలు మోహన్‌బాబు, బాలాజీ, బాలకృష్ణ ఉద్యోగులు గజేంద్ర, మంగత్యా, శ్రీనివాస్, సుధాకర్‌ను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకాలు జరగకుండా విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌తో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాలకు సంబంధించి పట్టుబడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, రోడ్లపై మద్యం సేవించటం, వేడుకలు నిర్వహించడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ కేఆర్‌కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది.. కంచె పడింది..

రూ.40 లక్షల విలువైన భూమి స్వాధీనం


గుడిపాడురోడ్డులోని బందెలదొడ్డికి వేసిన ఫెన్సింగ్

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి గుడిపాడు బందెలదొడ్డి స్థలాన్ని కొన్నాళ్ల కిందట కబ్జాకు యత్నించగా అప్పటి పరిస్థితుల్లో చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులు ఇన్నాళ్లకు కంచె వేసి రూ.40 లక్షల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ అంశంపై గతంలో 'బందెలదొడ్డి భూమి కబ్జాకు యత్నం'శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అయితే, అప్పటి అధికార పార్టీ కౌన్సిలర్ ప్రమేయంతో ఈ కబ్జా జరగగా యంత్రాంగం చర్యలు తీసుకోవటంలో మీనమేషాలు లెక్కించింది. రూ.40 లక్షలు విలువైన రెండు కుంటల భూమి కబ్జాకు గురవుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇంతలోనే రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో కబ్జా వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. దీంతో అధికారులు తాజాగా కంచె వేయించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, గుడిపాడులో బందెలదొడ్డి కోసం ఇరవై ఏళ్ల కిందట అప్పటి పంచాయతీ వార్డు సభ్యుడు గుడిమెట్ల పద్మనాభం తన తల్లిదండ్రులు పుల్లయ్య, అమ్మన్న జ్ఞాపకార్థం భూమి కొని పంచాయతీకి అప్పగించారు. పంచాయతీ ఆధ్వర్యాన గోడలు, నీళ్ల తొట్టిలు కట్టి గేట్లు బిగించి ఏళ్ల పాటు బందెల దొడ్డి నిర్వహించారు. గతేడాది మేలో విడతల వారీగా ఓ కౌన్సిలర్ అండదండలతో గోడలు తొలగించి చదును చేసి ఆక్రమణకు దిగటంతో అయ్యగారిపేటకు చెందిన రైతులు ఆందోళన చేసినా ఫలితం కన్పించలేదు. ఇప్పుడు అధికారం మారడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటుచేయగా, ప్రహరీ నిర్మించి కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరగా చట్టరీత్యా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

డ్రైవర్లకు నష్టం కలిగించే సెక్షన్లు రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: డ్రైవర్లకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106 (1) (2)ను రద్దు చేయాలని మోటార్స్ డ్రైవర్లు, ఓనర్లు, వర్కర్ల జేఏసీ నాయకులు కంకణాల శ్రీనివాస్, జిల్లా ఉపేందర్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఏదైనా ప్రమాదం జరిగితే కొత్త సెక్షన్ల ద్వారా ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా పడుతుందని తెలిపారు. దీంతో డ్రైవర్లకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉన్నందున విరమించుకుని, మోటారు వాహన రంగం కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ధరావత్ రాందాస్, ఎండీ పాషా, పాల్వంచ కృష్ణ, పేరుబోయిన మోహన్‌రావు, రావుల శ్రీను, ఎస్‌కే సత్తార్, విజయ్, భిక్షం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

60 ద్విచక్ర వాహనాలు సీజ్


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సారంగపాణి

ఖమ్మంక్రైం: నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న 60 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, నంబర్ ప్లేట్ తెచ్చిన వారికి వాహనాలు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వింత శబ్దాలను వచ్చేలా సైలెన్సర్లు అమర్చిన వాహనదారులతో పాటు సైలెన్సర్లు మార్చిన మెకానిక్‌లపై సైతం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తనిఖీల్లో సీఐ అశోక్, ఎస్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి


కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న కమాండెంట్ మనీష్ కుమార్ మీనా

చర్ల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ మనీష్ కుమార్ మీనా పేర్కొన్నారు. మండలంలోని ఉంజుపల్లిలో ఉన్న సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపులో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సమీప గ్రామాల మహిళలకు టైలరింగ్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. మహిళలకు భరోసా కల్పించేందుకు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోని గ్రామాల్లో టైలరింగ్ శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ పీయూష్ తివారీ, అసిస్టెంట్ కమాండెంట్ వినాయక్ రంజన్, పూసుగుప్ప ఉప సర్పంచ్ సతీష్‌కుమార్, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప, వెంకటచెరువు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మరో రూ. రెండు వేల కోట్ల రుణం

బాండ్ల వేలం వేసి ఆర్‌బీఐ ద్వారా సర్కారు సేకరణ

సాక్షి, హైదరాబాద్‌: ఈ నెలలో తెలంగాణ ప్రభుత్వరుణాలు రూ.2 వేల కోట్లకు చేరనున్నాయి. రుణాల కోసం రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఆర్‌బీఐ) ద్వారా సెక్యూరిటీ బాండ్ల వేలం వేస్తోంది. ఈ మొత్తంలో రూ.వెయ్యికోట్లను ఈ నెల 16వ తేదీన తీసుకోగా, మరో రూ.వెయ్యి కోట్లను 23న సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్‌ విడుదల చేసింది. గత డిసెంబర్‌లో రూ.1,400 కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్‌లో సేకరించిన ప్రభుత్వం జనవరిలో మరో రూ.రెండు వేల కోట్లను సమకూర్చుకోనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌ ప్రభుత్వ అప్పుల పద్దు రూ.3,400 కోట్లకు చేరనుంది.

వ్యవసాయేతర రుణాలను వసూలు చేయాలి

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: డీసీసీబీలు, ప్యాక్స్‌ల్లో వ్యవసాయేతర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని ఎగవేతదారుల నుంచి బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్‌ పర్యటన సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు ప్యాక్స్‌ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించనివారిపై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్యాక్స్‌లను బలోపేతం చేయాలని కోరారు. తమది రైతు ప్రభుత్వమని, రైతుల మేలు కోరే ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్‌: ఆర్థిక ఇబ్బందులతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నరేశ్‌(32) చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ధనుంజయ్య తెలిపారు.

తెలంగాణకు మరిన్ని కేంద్ర సంస్థలు



ఇన్వెంటివ్‌-2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌

ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్‌-2024 ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌

- వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశాం
- అభివృద్ధి భారత్‌ లక్ష్యాన్ని సాధించడానికి స్టార్టప్‌లే వెన్నెముక
- దేశాన్ని మాన్యుఫాక్చరింగ్‌ హబ్‌గా మార్చాలని పిలుపు
- ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: డిజిటైజేషన్, డిస్టెన్స్‌ లెర్నింగ్‌ మెథడాలజీ, ఆన్‌లైన్‌ అప్రోచ్, డిజిటల్‌ నెట్‌ వర్కింగ్‌ వంటి అంశాలకు సంబంధించి తెలంగాణలో కేంద్ర సంస్థలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ చెప్పారు. తెలంగాణలో ఇటీవలే రూ.వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రాచీన భారతం ఎన్నో ఆవిష్కరణలకు భూమికగా నిలిచిందని.. ఆధునిక భారతం విశ్వమిత్రగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్‌' నినాదంతో దేశయువత భారత్‌ను గ్లోబల్‌ ఇన్నోవేషన్‌ లీడర్‌గా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా సంస్థల రెండో ఎడిషన్‌ 'ఇన్వెంటివ్, ఆర్‌అండ్‌డీ ఇన్నోవేషన్‌ ఫెయిర్‌'ను ధర్మేంద్ర ప్రధాన్‌ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల ఈ సదస్సులో ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థలు కలిపి మొత్తం 53 విద్యా సంస్థల నుంచి 120 ఆవిష్కరణలను ప్రదర్శనకు పెట్టారు. హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఫుడ్‌ ప్రాసెసింగ్, క్లైమేట్‌ చేంజ్, ఈ-మొబిలిటీ, క్లీన్‌ ఎనర్జీ, డిఫెన్స్‌ అండ్‌ స్పేస్, ఇండస్ట్రీ 4.0 తదితర ఇతివృత్తాలతో వీటిని రూపొందించారు.

దేశాన్ని తయారీ కేంద్రంగా మార్చుతాం

ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగపడేలా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐఐటీలకు ప్రధాని మోదీ సూచించినట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ గుర్తు చేశారు. 2047 నాటికి భారత్‌ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న కల సాకారంలో స్టార్టప్‌ కంపెనీలు వెన్నెముకగా నిలుస్తాయని.. ఇన్వెంటివ్‌-2024 వంటి సమావేశాలు రోడ్‌ మ్యాప్‌గా ఉపయోగపడతాయని చెప్పారు. నూతన ఆవిష్కరణలు మరింత పెరిగేలా విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ అంతా సహకారం అందించాలని కోరారు. దేశ జీడీపీలో కనీసం 25 శాతానికి దోహదపడేలా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశగానే 'మేక్‌ ఇన్‌ ఇండియా, ఇన్వెస్ట్‌ ఇన్‌ ఇండియా, పీఎల్‌ఐ స్కీమ్, ఎఫ్‌డీఐ లిబరలైజేషన్‌'వంటి విధానాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. డిజిటల్‌ పబ్లిక్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డొమైన్‌లో 46 శాతం గ్లోబల్‌ డిజిటల్‌ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని, మనదేశం ఇన్నోవేషన్‌కు ఇంక్యుబేటర్‌గా మారిందని చెప్పారు. 2014లో 350 స్టార్టప్‌ కంపెనీలు ఉంటే.. ఇప్పుడవి లక్షా 20వేలకు చేరాయన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

విద్యార్థుల ఆత్మహత్యలు సమాజానికి మంచిది కాదని కేంద్ర మంత్రి అన్నారు. ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు.

విద్యుత్‌ చార్జింగ్‌ స్టేషన్లు పెంచండి

- సోలార్‌ విద్యుత్‌ వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: భట్టి

సాక్షి, హైదరాబాద్‌: విద్యుత్‌ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్‌ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు. పెట్రోల్, డీజిల్‌ వాహనాలతో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధన పొదుపులో భాగంగా మార్కెట్లోకి వస్తున్న విద్యుత్‌ వాహనాలకు చార్జింగ్‌ అందించడానికి అన్ని ప్రాంతాల్లో చార్జింగ్‌ స్టేషన్లు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సౌర, పవన, జల విద్యుత్‌ ఉత్పత్తి కార్యక్రమాలపై డిప్యూటీ సీఎం శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో విద్యుత్‌ కొరత రాకుండా సౌర విద్యుత్‌ను పెద్ద మొత్తంలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్రంలోని జలాశయాలపై సోలార్‌ ప్రాజెక్టుల నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్‌ రూఫ్‌టాప్‌ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిశీలించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ఆ రాయితీలను ప్రజలకు వివరించండి

రాష్ట్రంలో సౌర విద్యుత్‌ ఉత్పత్తి పెంచడానికి గృహ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. గృహ వినియోగదారులు ఒక కిలో వాట్‌ సౌర విద్యుత్‌ ఉత్పత్తి ప్యానెల్స్‌ ఏర్పాటు చేస్తే..రూ. 18 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. మూడు కిలో వాట్స్‌ నుంచి పది కిలో వాట్స్‌ వరకు కిలో వాట్‌ కు రూ. 9 వేలు లెక్కన ప్రభుత్వం రాయితీ ఇస్తోందనీ, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

బీసీల బడ్జెట్‌ రూ. 20 వేల కోట్లకు పెంచాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రమిచ్చిన ఎంపీ కృష్ణయ్య



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న ఆర్‌.కృష్ణయ్య

కాచిగూడ: వచ్చే బడ్జెట్‌లో బీసీల కేటాయింపులను రూ.20 వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, టి.రాజ్‌కుమార్‌ శుక్రవారం సచివాలయంలో మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని భట్టికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు కేటాయించాలని విన్నవించారు. బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని కోరారు. మెస్‌ చార్జీలు, స్కాలర్‌ షిప్‌లను పెంచాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు.

పెట్టుబడుల కోసం అదానీని కలిస్తే తప్పేంటి?

- బావ బావమరిది పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు
- డిపాజిట్లు రావనే బీజేపీ నేతలతో మంతనాలు: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, పరిశ్రమల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో పారిశ్రామికవేత్త అదానీని కలిస్తే తప్పేంటని రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. దాన్ని కూడా విమర్శిస్తున్నారని, ఆ మాత్రం కామన్‌సెన్స్‌ కేటీఆర్‌కు లేదా అని జూపల్లి నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కి చెందిన బావ బావమరుదులు హరీశ్, కేటీఆర్‌ పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం బీఆర్‌ఎస్‌ తెర వెనుక యత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రావని నిర్ధారించుకున్న తర్వాతే బీఆర్‌ఎస్‌ను బతికించుకునేందుకు బీజేపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారని విమర్శించారు.

హరీశ్‌వి ఝూటా మాటలు

కేసీఆర్‌ బంగారు పళ్లెంలో పెట్టి రాష్ట్రాన్ని కాంగ్రెస్‌ చేతిలో పెట్టారంటూ హరీశ్‌ ఝూటా మాటలు మాట్లాడుతున్నారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్‌ రూ.ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారని, ఆయన నిర్వాకాన్ని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రజల ముందు బట్టబయలు చేశామన్నారు. ఇంత అప్పుల భారం ఉన్నా ప్రజల కిచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక స్థానాలను హస్తగతం చేసుకుంటుందన్నారు.

గల్ఫ్‌ ఏజెంట్ల ఇంట్లో సీఐడీ సోదాలు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముగ్గురు గల్ఫ్‌ ఏజెంట్ల ఇళ్లలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో కొన్ని పాస్‌పోర్టులు, నకిలీ ధ్రువపత్రాలు, స్టాంపులతో పాటు ఓ గల్ఫ్‌ ఏజెంట్‌ ఇంట్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సోదాలు జరిగాయి. కోరుట్లకు చెందిన అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు కొన్నేళ్లుగా పాస్‌పోర్టులు ఇప్పిస్తూ గల్ఫ్‌ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్‌ అకౌంట్‌ బుక్‌లు, పదోతరగతి మెమోలు, బోనఫైడ్‌ సర్టిఫికెట్లు, స్టాంపులు, ఇతరత్రా నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకొని ముగ్గురు ఏజెంట్లతో పాటు, ఓ ఏఎస్‌ఐని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిసింది.

నకిలీ పాస్‌పోర్టు ఆధారంగా..

నెలరోజుల క్రితం జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో అతడిది నకిలీ పాస్‌పోర్టు అని గుర్తించిన ఇమిగ్రేషన్‌ అధికారులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇండియన్‌ ఎంబసీకి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం మేర కు అప్రమత్తం అయిన హైదరాబాద్‌ పోలీసులు కేసును సీఐడీకి అప్పగించినట్టు సమాచారం. నకిలీ పాస్‌పోర్టు జారీ చేసే సమయంలో సదరు ఏఎస్‌ఐ జగిత్యాల స్పెషల్‌ బ్రాంచ్‌లో పని చేస్తున్నాడు.

నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలు

అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు పదేళ్లక్రితం పాస్‌పోర్టులు ఇప్పించే సమయంలో కంపెనీలు వీసాల కోసం జతచేసే ఈసీఎన్‌ఆర్‌ క్లియరెన్స్‌కు దరఖాస్తుదారు చదువుకోకున్నా, కొన్ని విద్యా సంస్థలకు చెందిన నకిలీ ధ్రువపత్రాలు తయారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా నకిలీ పత్రాలతో పదోన్నతులు పొందిన కొంతమంది ఉపాధ్యాయులు సైతం రివర్షన్‌కు గురయ్యారని సమాచారం. మళ్లీ నకిలీ ధ్రువపత్రాలు తయారుచేస్తున్నారన్న సమాచారంలో సీఐడీ అధికారులు సోదాలు చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

విమానాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వాలి

- క్యాటరింగ్‌ సంస్థలకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: విమాన ప్రయాణికులకు అందజేసే ఇన్‌ఫ్లైట్‌ భోజనం విషయంలో కచ్చితమైన నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఫుడ్‌సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) సంబంధిత సంస్థలను ఆదేశించింది. విమానాల్లో ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందజేసే క్యాటరింగ్‌ సంస్థలు, ఎయిర్‌లైన్స్‌ సంస్థలతో ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహార పదార్థాల నాణ్యత, నిబంధనల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఇచ్చే ఆహారం ఎంతో సురక్షితంగా, నాణ్యమైనదిగా ఉండాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సూచించింది. ఆహార భద్రత, ప్రమాణాల మేరకు లేబులింగ్, డిస్‌ప్లే స్పష్టంగా ఉండాలని, ఈ మేరకు 2020లో విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్ని విమాన క్యాటరర్లు, విమానయాన సంస్థలను ఆదేశించింది. ప్రయాణ సమయంలో అందజేసే ఆహార పదార్థాల పూర్తి వివరాలు ప్రయాణికులకు ఇవ్వాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆదేశించారు. దీంతో క్యాటరింగ్‌ సేవల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. మరోవైపు ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

జిల్లా వార్తలు

రామయ్య నిత్యాన్నదానానికి విరాళాలు



దాతలకు రశీదు అందజేస్తున్న ఏఈఓ

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి పలువురు భక్తులు శుక్రవారం విరాళాలు అందజేశారు. ఏపీలోని రాజమండ్రి దానవాయిపేట కు చెందిన గుండు వెంకటసుధీర్‌ రూ.లక్ష, చిత్తూరు జిల్లా చింతలపట్టడైనగర్‌కు చెందిన పీడీ రఘురామన్‌-లోకేశ్వరి దంపతులు రూ.1,00,009ను ఆలయ అధికారులకు అందజేయగా వారు రశీదు ఇచ్చి స్వామిదర్శనం చేయించారు. కార్యక్రమంలో ఏఈఓ భవానీరామకృష్ణ, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గగనతలంపై మినీ విమానం



కందిపాడు సమీపాన ఎగురుతున్న విమానం

చర్ల: మండలంలో గగనతలంపై శుక్రవారం మినీ విమానం చక్కర్లు కొట్టింది. మండలంలోని కొయ్యూరు, ఉప్పరిగూడెం, లెనిన్‌కాలనీ, కందిపాడు మీదుగా ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని పామేడు ప్రాంతానికి వెళ్లిన ఈ విమానం మళ్లీ అదే మార్గంలో తిరిగి వెళ్లింది. హెలీకాప్టర్‌ ఎగిరే ఎత్తు కంటే తక్కువ ఎత్తులో ఇది ప్రయాణించగా విమానాన్ని చూసిన ఏజెన్సీ వాసులు ఆందోళనకు గురయ్యారు. మూడు రోజుల కిందటే సరిహద్దున ఉన్న పామేడులోని పోలీసు క్యాంపులపై మావోయిస్టులు దాడికి పాల్పడగా మావోయిస్టులను గుర్తించేందుకు పోలీసులు మినీ విమానాల్లో ప్రయాణిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, అది పైలట్లకు శిక్షణ ఇచ్చే మినీ విమానం అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తిరుమలాయపాలెం మండలంలో..

తిరుమలాయపాలెం: ఆకాశంలో పక్షి మాదిరి కనిపిస్తూ ఓ చిన్న విమానం తక్కువ ఎత్తులో ప్రయాణించింది. తిరుమలాయపాలెం మండల కేంద్రంతో పాటు ఎదుళ్లచెరువు, రమణాతండా ప్రాంతాల మీదుగా శుక్రవారం ఉదయం ఈ విమానం వెళ్లింది. తక్కువ ఎత్తులో పొలాల మీదుగా వెళ్లిన విమానాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఉత్సాహంగా కథా, కవితా కార్యశాల

- భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నిర్వహణ
- వివిధ పాఠశాలల నుంచి హాజరైన 500 మంది విద్యార్థులు
- ప్రారంభించిన బాలోత్సవ్‌ జాతీయ కన్వీనర్‌ రమేశ్‌బాబు



కార్యశాలను ప్రారంభిస్తున్న బాలోత్సవ్‌ కన్వీనర్‌ రమేష్‌బాబు, డీఈఓ చారి తదితరులు

కొత్తగూడెంటౌన్‌: బాలబాలికలు భాషపై పట్టు సాధించడమే కాక.. రచనలపై ఆసక్తి కలిగేలా తర్ఫీదునిచ్చేందుకు కొత్తగూడెం క్లబ్‌లో 'బాలోత్సవ్‌' ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే కథా, కవితా కార్యశాల శుక్రవారం ప్రారంభమైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి పాఠశాలకు ఐదుగురి నుంచి పది మంది చొప్పున దాదాపు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. అలాగే, నల్లగొండకు చెందిన కోదాడ స్కూల్‌ (సోమిరెడ్డి) విద్యార్థులు సైతం వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొనగా.. మొదటి రోజు పలువురు కవులు కవితలు, కథలు ఎలా రాయాలి, ఎలాంటి అంశాలను ఎంచుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. తెలంగాణ, ఏపీ నుంచి వచ్చిన పలువురు కవులు, రచయితలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పలు అంశాలపై ఆసక్తి పెంపొందేలా తర్ఫీదునిచ్చారు.

భాషపై ఆసక్తి పెంపొందించేలా..

నేటి విద్యార్థులే రేపటి కవులు, కథకులు, మేధావులని బాలోత్సవ్‌ జాతీయ కన్వీనర్‌ డాక్టర్‌ వాసిరెడ్డి రమేశ్‌బాబు తెలిపారు. కొత్తగూడెంక్లబ్‌లో కథా, కవితా కార్యశాలను భద్రాద్రి జిల్లా డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలుగుభాషపై మమకారంతో పాటు రచనలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించడం ద్వారా సొంతంగా కథలు, కవితలను రాసేలా శిక్షణ ఇస్తారని వెల్లడించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ.. సామాజిక మార్పు, పురోగతికి సాహిత్యం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మేరకు బాలబాలికల్లో సాహిత్యంపై ఆసక్తి, అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల రచయితలు వీఆర్‌ తూములూరి, కిలారి స్వర్ణ, కోట్టం రామకృష్ణారెడ్డి, ఎలియా మన్నె, అనిల్‌ డ్యానీ, కొనూరి రవికుమార్, డాక్టర్‌ కటుకోజ్వల రమేశ్, భగవంతం, వెంకట్రావు, మల్సూర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు రచనల్లో మెళకువలు నేర్పిస్తున్న దృశ్యం

చాలా ఆనందంగా ఉంది



చిన్నప్పటి నుంచి కథలు చదవడమంటే ఇష్టం. అందుకే కవితలు, కథలు రాయడం నేర్చుకోవాలని వచ్చా. మొదటి రోజు రచనలు ఎలా చేయాలో అవగాహన కల్పించారు. బాలోత్సవ్‌ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

-చంద్రలేఖ, 10వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్‌ పోకలగూడెం, చంద్రుగొండ

విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది..



ఇలాంటి పోటీలతో పిల్లల్లో రచనలు, సాహిత్యంపై ఆసక్తి పెరుగుతుంది. రాయాలనే తపన మొదలవుతుంది. బాలోత్సవ్‌ ఆధ్వర్యాన బాలబాలికలకు మెళకువలు నేర్పించడం బాగుంది. పిల్లలకు భాష, సాహిత్యంపై ఆసక్తి పెంచేందుకు తోడ్పడుతుంది.

-బి.వీరన్న, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్‌ పోకలగూడెం, చంద్రుగొండ

అణుశక్తి విభాగాల్లో కార్మికులకు అండగా ఉంటాం..

అశ్వాపురం: అణుశక్తి విభాగాల్లోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తామని అణుశక్తి కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గడ్డం రమేశ్‌ తెలిపారు. అశ్వాపురంలోని గౌతమీనగర్‌ కాలనీలో భారజల కర్మాగారం కార్మిక సంఘం, సైంటిఫిక్‌ అసిస్టెంట్స్‌ అండ్‌ సూపర్‌వైజర్స్‌ అసోసియేషన్‌ సంయుక్త ఆధ్వర్యాన జాతీయ అణుశక్తి కార్మిక సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని రమేశ్‌ ఆవిష్కరించగా, ఇటీవల మరణించిన కేఎస్‌ ఆనంద్‌ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సంఖ్య తగ్గుదల, వైద్య సౌకర్యాలు మెరుగుపరచడంపై పోరాడాల్సిన అవసరముందని తెలిపారు. భారజల కర్మాగారం ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూరపాటి శ్రీనివాసరావు, పోతురాజు శ్రీనివాసరావుతో పాటు గుడ్ల శ్రీనివాసరావు, పాడ్య కేశవరావు, పోగుల ప్రతాపరెడ్డి, ఊకె వెంకటేశ్వర్లు, కేవీ రావు, వేణుగోపాల్, అంజన్‌రావు, మోహన్‌బాబు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌

రైతులకు మేలు.. డీసీసీబీ అభివృద్ధి

- నష్టాలను అధిగమించి లాభాల్లోకి తీసుకొచ్చాం
- డీసీసీబీ చైర్మన్‌ కూరాకుల నాగభూషణం



మాట్లాడుతున్న చైర్మన్‌ నాగభూషణ, పక్కన సీఈఓ రెహమాన్‌

ఖమ్మంవ్యవసాయం: రైతులకు మేలు చేస్తూనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ను అభివృద్ధి పథాన నిలిపామని చైర్మన్‌ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 మార్చిలో తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయాన బ్యాంకు రూ.7.23 కోట్ల నష్టాల్లో ఉండగా, నాలుగేళ్ల పాలనలో నష్టాలను అధిగమించి రూ.10.88 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని వివరించారు. రూ.116.31 కోట్లుగా ఉన్న మూలధనాన్ని రూ.144.33 కోట్లకు, రూ.994.03 కోట్లుగా ఉన్న డిపాజిట్లను రూ.1,109.35 కోట్లకు చేర్చామని తెలిపారు. అలాగే, అన్నివర్గాల వారికి రుణాలు ఇస్తూ బ్యాంకు వ్యాపారాన్ని పెంచామని పేర్కొన్నారు.

సొసైటీని కూడా అభివృద్ధి చేశా..

రఘునాథపాలెం మండలం వీవీ పాలెంలోని పీఏసీఎస్‌ చైర్మన్‌గా సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని నాగభూషణం తెలిపారు. చైర్మన్‌ తాను బాధ్యతలు చేపట్టిన సమయాన పీఏసీఎస్‌లో రూ.15.12 లక్షలుగా ఉన్న డిపాజిట్లను రూ.2.85 కోట్లకు పెంచినట్లు పేర్కొన్నారు. ఎక్కడా అవినీతికి పాల్పడకుండా రైతులు, అన్నివర్గాల ప్రజలకు సేవలందించానని తెలిపారు. అయితే, ప్రభుత్వం మారడంతో కొందరు ఆ వైపునకు వెళ్లి అవకాశాలను వినియోగించుకుంటున్నారని వెల్లడించారు. నాలుగేళ్ల కాలంలో తనకు సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ అబిద్‌ ఉర్‌ రెహమాన్‌ పాల్గొన్నారు.

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపాలి



రైతులకు డ్రోన్‌ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: అన్నదాతలు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపితే మంచి ఫలితాలు వస్తాయని ఎక్స్‌టెన్షన్‌ ఎడ్యుకేషన్‌ ఇన్‌స్టిట్యూట్‌ (ఈఈఐ) డైరెక్టర్‌ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలో ఈఈఐ, ఎవర్‌గ్రీన్‌ ఎనర్జీ లిమిటెడ్‌ అధికారులతో కలిసి నాబార్డ్‌ సహకారంతో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ఆవశ్యకత, వాతావరణ సంబంధిత సమాచారం తెలుసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే, వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా శాస్త్రవేత్తలు చర్చించే సదుపాయం, వ్యవసాయంలో డ్రోన్‌ వినియోగాన్ని వివరించారు. నాబార్డు డీడీఎం సుజీత్, ఎల్‌డీఎం రాంరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, కేవీకే కోఆర్డినేటర్‌ లక్ష్మీనారాయణమ్మ, ఏడీఏలు అఫ్జల్‌బేగం, తాతారావు, సర్పంచ్‌ ప్రమీలతో పాటు ఈఈఐ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డి.శిరీష, సీఎండీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో 23న జాబ్‌మేళా

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఈ నెల 23న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గిరిజన నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్లు పీఓ ప్రతీక్‌జైన్‌ తెలిపారు. నర్సింగ్‌ ఉద్యోగాలతో పాటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ సంస్థల ద్వారా వెబ్‌ మొబైల్‌ అప్లికేషన్, బ్యూటీషియన్, అసిస్టెంట్‌ ఎలక్ట్రీషియన్, సీసీటీవీ టెక్నీషియన్, టూవీలర్‌ మెకానిజంలో భోజన, వసతితో కూడిన ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ జిరాక్స్‌లతో ఈనెల 23న ఉదయం 9 గంటలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పీఓ సూచించారు.